

కథా కౌముది

# ఏకాకి నౌక చప్పుడు

ఎమ్.సుగుణ రావు



పిడపర్తి వెంకటరమణశర్మగారి జ్ఞాపకార్థం కౌముది నిర్వహించిన కథల పోటీ (2023)లో బహుమతి పొందిన కథ

సుబ్బారావు కిటికీ లోంచి చూస్తున్నాడు. పట్టపగలే స్మశానంలా అనిపించింది. తన అపార్ట్‌మెంట్ చుట్టూ చెట్లు. చెట్టు మీద ఆకే కాదు, ఏ పిట్టా లేదు. ఒక్క మనిషి జాడా లేదు. కిటికీ లోంచి దృష్టి మరల్చి తన ఇంట్లో పరిసరాల వైపు చూసాడు. ఆ ఇంట్లో తనతో పాటు ఉండే టి.వి., డ్రాయింగ్ రూమ్‌లోని పుస్తకాలు, వంటగదిలో ఫ్రిజ్, బెడ్‌రూమ్‌లో మంచం ` వాటితోనే తనకిప్పుడు మాటలు. భార్య తనను వదిలివెళ్లి సంవత్సరం అయ్యింది. ఉన్న ఒక్కగానొక్క కొడుకు రెక్కలొచ్చి ఎగురుకుంటూ వెళ్లిపోయాడు. ఆ రెక్కలిచ్చింది తనే.

‘‘నాన్నా! నేను అమెరికా వెళ్తాను’’ అనగానే తనకు లెక్కకు మించిన భారమైనప్పటికీ తనకు ఉన్న కొద్దిపాటి పొలం అమ్మేసి కొడుకును అమెరికా పంపేసాడు. రిటైర్‌మెంట్‌కి ఇంకో సంవత్సరం టైమ్ ఉంది. ఇప్పుడు అందరిలాగే తనూ ఇంట్లో బందీ అయిపోయాడు.

సోఫాలో కూర్చొని తనకు ఇష్టమైన ఆ కవితను చదువుతూ ఉండిపోయాడు.

‘‘ఎండలో వానలో ఎండిన చివికిన  
ఒక చిన్న సైజు జీతగాడు  
చెవిలో పెన్సిల్  
చేతిలో సంచి  
ఖాకీ దుస్తులు

అరిగిన చెప్పులు
ఒక సాదా పేదా వాడు
అందరికీ నువ్వు ఆత్మబంధువు
అందరికీ నువ్వు వార్తనందిస్తావు
కానీ నీకు ఎవరూ మాత్రం తోడు రారు
నీతోనే నీ మథనం''

ఆ కవిత చదివి ఒక్కసారి నిట్టూర్చాడు. ఆ కవిత తన కోసమే రాశాడు, దేవరకొండ బాలగంగాధర్ తిలక్. ఒక తపాలా బంట్రోతు కవిత. అది తన కథే. ఒక్కసారి కళ్లు మూసుకున్నాడు. గతం కళ్ల ముందు మెదిలింది.

అప్పట్లో తనకి ఏ ఉద్యోగమూ సద్యోగమూ లేకుండా పదవ క్లాసు పరీక్ష తప్పి ఇంట్లో కూర్చుంటే మేనమామ సలహా ఇచ్చాడు. ''ఒరేయ్... పోస్టాఫీసులో నాకు తెలిసిన పెద్ద అధికారి ఉన్నారు. ఆయనకు చెప్పి నీకు మెసెంజర్ ఉద్యోగం వేయిస్తాను. అది టెంపరరీ పోస్టు. ఓపిగ్గా ఊరూరా తిరిగి ఉత్తరాలు అందివ్వాలి. నీ అదృష్టం బాగుంటే పర్మనెంట్ అవుతుంది. దాంతో ఏ ఆధారం లేని తను ఎగిరి గంతేసాడు.

శ్రీకాకుళంలోని ఆ పల్లెటూళ్లో ఒక ఇంట్లో పోస్టాఫీసు నడిపే అప్పారావు నాయుడు అనే ఆయన దగ్గర చేరాడు. ఆ పల్లెటూరు అప్పటికి ఒక మండలంగా రూపు దిద్దుకుంది. ఆ మండలంలో అనేక ఊళ్లు. అన్ని ఊళ్లకు రోడ్డు సదుపాయం లేదు. కొన్ని ఊళ్లు వెళ్లాలంటే ఏరు దాటాలి. తను ఉత్తరాల సంచీ భుజాన వేసుకొని ఊరూరా తిరుగుతూ ఉత్తరాలు పంచేవాడు. అది సెల్‌ఫోన్ లేని కాలం. ఉత్తరాల మీదే సమాచారం నడిచేది.

తపాలా బట్వాడా చేసే ఒక వార్తాహరుడిగా తను ఒక పదేళ్లు పని చేసాడు, అతి తక్కువ జీతంతో. ఆ తర్వాత ప్రభుత్వంవారు కరుణించి తన మెసెంజర్ ఉద్యోగాన్ని పర్మనెంట్ చేస్తూ పోస్ట్‌మేన్ అనే హోదా కల్పించారు. ఆ పల్లెటూరు నుంచి విశాఖపట్నం నగరానికి వచ్చి పడ్డాడు. కాస్త ఊపిరి పీల్చుకున్నట్టయ్యింది. రెండు కాళ్లకు బలపాలు కట్టుకొని కాళ్లే చక్రాలుగా పరిగెట్టిన పల్లె బతుకు నుంచి పట్టణంలోకి వచ్చి పడ్డాడు. నడవక్కరలెద్దు. తనకు రెండు చక్రాల సైకిలు. హుషారుగా సైకిల్ ఎక్కి తన ఉద్యోగ జీవితం మొదలుపెట్టాడు. ఆ తర్వాత పెళ్లయ్యింది. ఒక కొడుకు.

వర్తమానంలోకి వస్తే ఇప్పుడు తను మాత్రం ఒంటరి.

ఎదురుగా ఉన్న దండ వేసిన భార్య ఫోటో వైపు చూసి నిట్టూర్చాడు. తలుపు దగ్గరికి వెళ్లి తలుపు తీద్దామనుకొని భయపడి వెనక్కి వచ్చేసాడు. గుండె వేగంగా కొట్టుకుంది. ఒక కనిపించని సూక్ష్మజీవి ప్రపంచాన్ని శాసిస్తోంది. భార్య పోయిన సంవత్సరం నుంచి కొడుకు తన కోసం ఒక వంటమనిషిని ఏర్పాటు చేసాడు. భార్య ఉండగా తనను కాఫీ కూడా పెట్టుకోనిచ్చేది కాదు. అలా తను చేతకానివాడయ్యాడు.

తన అపార్ట్‌మెంట్‌లో చుట్టూ కరోనా కేసులు. ఆ ఏరియాను రెడ్ జోన్‌గా ప్రకటించారు. వారం క్రితం వరకు తను ఆఫీసుకు వెళ్తూ ఉండేవాడు. ఉత్తరాలు బట్వాడా సాగేది. తన ఉద్యోగమే తనకు ఊపిరి, సంతోషాన్ని ఇచ్చేది. కరోనా గురించిన ప్రమాద సూచికలు వినబడగానే తమ బ్రాంచి ఆఫీసు పోస్ట్ మాస్టర్ గారు, ''ఏమండి సుబ్బారావు గారూ! ఇప్పుడు మీకు వయస్సు యాభై తొమ్మిది. ఇంకా డయాబిటిస్, ఆస్తమాతో బాధ పడుతున్నారు. మీరు ఈ పరిస్థితుల్లో ఇంటింటికీ తిరిగి ఉత్తరాలు ఇచ్చి, మళ్లీ తిరిగి మా ఆఫీసుకు వస్తే ఇక్కడి వారికీ ప్రమాదమే! మీరు ఉద్యోగం చేయకపోయినా జీతం అందుతుంది. ఇన్నాళ్లూ కష్టబడ్డారు. ఇలాగైనా మీకు విశ్రాంతి లభించింది. రెస్ట్ తీసుకోండి'' చెప్పేసాడు.

ఆ మాటలతో ఒక్కసారి నిస్సత్తువ వచ్చినట్టయ్యింది. ఏనాడూ తను ఆఫీసుకు సెలవు పెట్టలేదు. ఒక్కడే ఇంట్లో ఉండబుద్ధి కాదు. అయినా ఇంట్లో ఉండడానికి ఎవరున్నారని? వెల్లవేయని గది గోడలు, తిరిగే ఫ్యాను, నిద్రపోయే పుస్తకాలు...

'అబ్బా... తనకూ కవిత్వం వచ్చేస్తోంది' అనుకుంటూ తన ఎదురుగా ఉన్న తిలక్ రాసిన పుస్తకం వైపు ఆపేక్షగా చూసాడు. అంతలో సెల్‌ఫోన్ మోగింది. అవతలి నుంచి కొడుకు.

''నాన్నా! ఎలా ఉన్నారు?'' కొడుకు కంఠంలో ఆదుర్దా.

''బాగానే ఉన్నాను నాన్నా. అక్కడ నువ్వెలా ఉన్నావ్?'' ఆతృతగా అడిగాడు సుబ్బారావు.

''ఇక్కడ కూడా పరిస్థితి బాగోలేదు. చూస్తుండగానే మనుష్యులు విగతజీవులైపోతున్నారు. నేనూ ఇల్లు కదలడం లేదు. వర్క్ ఫ్రమ్ హోమ్. నువ్వు కూడా బైటికి వెళ్లకు. నీకు ఇంటి దగ్గరికే కాఫీ, టిఫిన్, భోజనం తీసుకువచ్చే ఏర్పాటు చేస్తాను'' చెప్పాడు కొడుకు.

''ఊరంతా నిర్మానుష్యంగా ఉంది కదా, ఈ టైమ్‌లో మన ఇంటికి వచ్చేది ఎవరు?'' చెప్పాడు.

''లేదు. నాకు తెలిసిన కొరియర్ సర్వీస్‌వారు ఇలా ఈ కరోనా కాలంలో నీలా ఒంటరిగా ఉండేవాళ్ల కోసం తమ కొరియర్ సర్వీస్ ద్వారా ఈ ఏర్పాటు చేయిస్తున్నారు. మన ఇంటి అడ్రసు, నీ ఫోన్ నెంబర్ ఇచ్చాను. నీకు వేళకి కాఫీతో సహా అన్నీ అందుతాయి. నువ్వు మాత్రం బైట తిరగవద్దు'' చెప్పాడు కొడుకు.

''సరే... నువ్వు జాగ్రత్త!'' అంటూ ఫోన్ పెట్టేసాడు సుబ్బారావు.

సోఫాలో వచ్చి కూర్చున్నాడు. కొరియర్ సర్వీస్ అనగానే సుబ్బారావుకు కాస్త అసహనం కలిగింది. ఆ సర్వీసు ప్రారంభమైన కొత్తలో వారిని చూస్తే కోపం వచ్చేసేది. 'తమ తపాలా శాఖకు పోటీగా వచ్చేసాయి ఈ సర్వీసులు' అనుకొనేవాడు. ఎవరైనా కొరియర్ కుర్రవాడు ఎదురుపడితే వాడిని తినేటట్టు చూసేవాడు. ఇప్పుడు విధివిలాసం తనకు ఇప్పుడు ఈ కొరియర్ సర్వీసే గతి అయ్యింది. సోఫాలో వెనక్కి వాలి నిట్టూర్పు విడిచాడు.

ఇంతలో తన గదిలో ఇంటర్ కమ్ మోగింది. కింద సెక్యూరిటీ నుంచి ఫోన్. ''సార్... మీ కోసం కొరియర్ బాయ్ వచ్చాడు. కాఫీ, టిఫిన్ పట్టుకొచ్చాడు. కిందకి దిగండి'' చెప్పాడు సెక్యూరిటీ.

''వస్తున్నా. ఒక్క నిమిషం...'' అంటూ మాస్క్ తగిలించుకొని చేతిలో శానిటైజర్‌తో తలుపు తీసాడు సుబ్బారావు.

ఎదురుగా ఇంటి తలుపులన్నీ మూసి ఉన్నాయి. లిఫ్ట్ ఎక్కి కిందకు దిగాడు. సెక్యూరిటీ దగ్గర ఒక పాతికేళ్ల కుర్రవాడు. అతను మాస్క్ తీసి, చిన్నగా నవ్వి, ''నమస్కారం సార్... నా పేరు కార్తిక్'' అన్నాడు నవ్వుతూ.

దూరం నుంచే అతన్ని చూసి, చిన్నగా నవ్వి, ''నువ్వెందుకు నాకు తెలియదు! నీకు అప్పుడప్పుడు గ్రీటింగ్స్ ఇచ్చేవాడిని. చాలా సంవత్సరాలు. నువ్వు వుండే ఆ హాస్టల్ నా పరిధిలోనే ఉండేది'' అన్నాడు సుబ్బారావు.

కార్తిక్ మళ్లీ మాస్క్ పెట్టేసుకొని, ''మీరేమీ కంగారు పడకండి సార్. మీ అబ్బాయిగారు అన్ని ఏర్పాట్లూ చేసారు. ఏం కావలసివచ్చినా నేను మీకు అందుబాటులో ఉంటాను. ఈ కరోనా కాలంలో మీలాంటి పెద్దవారికి సహాయం చేసేందుకు మా కొరియర్ సంస్థ ఇలా ముందుకొచ్చింది'' అంటూ తన చేతిలో ఉన్న ఫ్లాస్క్, టిఫిన్ పొట్లం చేతికి అందించాడు.

''థ్యాంక్స్ బాబూ...'' అంటూ తన ఇంటి వైపు నడిచాడు.

అపార్ట్‌మెంట్ ఆవరణ అంతా నిశ్శబ్దంగా ఉంది. ఆ ఆవరణలో గేటు పక్కనే ఉన్న వినాయకుడి గుడి తలుపులు మూసుకొనే ఉన్నాయి. 'ఈపాటికి గుడి తలుపులు తెరిచి తమ గుడి పూజారి దీపం వెలిగించేవాడు. ఈ కరోనా కాలంలో దేవుడికి కూడా దూరం అయ్యాము' తనలోని తాను గొణుక్కుంటూ ఇంటికి చేరుకున్నాడు.

ఇంటికి వచ్చి టిఫిన్ చేసి, వేడి వేడి కాఫీ తాగేసరికి ఒక్కసారి ప్రాణం లేచి వచ్చినట్టయ్యింది సుబ్బారావుకు. సోఫాలో పడుకొని ఆలోచనలో పడ్డాడు. తనకు కొరియర్ తీసుకొచ్చిన ఆ అబ్బాయికి తను చాలా సంవత్సరాలుగా తెలుసును. తమ ఇంటికి రెండు వీధుల అవతల ఉన్న ఒక ఆర్ఫనేజ్ హాస్టల్‌లో ఉండేవాడు. ఆ పిల్లలకు వచ్చే ఉత్తరాలు, గ్రీటింగ్ కార్డులు తానిచ్చినపుడు వారి కళ్లు ఆనందంతో మెరిసేవి. తనదీ ఇప్పుడు అదే పరిస్థితి. ఒంటరి జీవితంలో తనను ఎవరైనా పలకరిస్తే, తనకు ఒక ఉత్తరం తెచ్చి ఇస్తే బాగుండుననుకుంటాడు. ఇప్పుడు అంతా చరవాణి ప్రపంచం. ఉత్తరాలు ఎక్కడి నుంచి వస్తాయి? అలా ఆలోచిస్తూనే నిద్రలోకి జారుకున్నాడు.

★ ★ ★

కళ్లు తెరిచేసరికి ఒళ్లంతా నొప్పులనిపించింది సుబ్బారావుకు. టైమ్ చూసాడు. మధ్యాహ్నం రెండు దాటింది. 'అబ్బే... చాలాసేపయ్యింది నిద్రపోయి' అనుకొనేసరికి కడుపులో ఆకలి మొదలయ్యింది. ఇంతలో మళ్లీ సెక్యూరిటీ నుంచి ఫోన్. ఫోన్ ఎత్తి ''ఏమిటి సంగతి?'' అన్నాడు సుబ్బారావు.

''మీ కోసం కొరియర్ బాయ్ భోజనం తెచ్చాడు సార్'' అన్నాడు అవతల సెక్యూరిటీ.

''కొంచెం నీరసంగా ఉంది. కిందికి రాలేను. పంపించరాదూ అతన్ని ఇక్కడికి?'' అన్నాడు సుబ్బారావు ప్రాధేయపడుతూ.

''సరే సార్...'' అంటూ సెక్యూరిటీ ఫోన్ పేట్టేసాడు.

పది నిమిషాల తర్వాత అతని డోర్ బెల్ మోగిన చప్పుడైంది. తలుపు తీసేసరికి కుర్రవాడు బైట తన తెచ్చిన భోజనం ప్యాకెట్టు ఉంచి వెళ్లిపోతున్నాడు.

''థ్యాంక్స్ బాబూ... మేలు చేసావ్'' అన్నాడు.

''ఫర్వాలేదు సార్. మీరు చేసినదాని కంటె ఇదెంత?'' అన్నాడు అతను.

అతను వెళ్లినవైపుగా చూస్తూ తలుపు మూసాడు. భోజనం అయిందనిపించి గదిలో అటూ ఇటూ పచార్లు చేస్తున్నాడు. ఆ తర్వాత మళ్లీ నిద్ర ముంచుకొచ్చింది.

★ ★ ★

నిద్ర నుంచి లేచేసరికి మధ్యాహ్నం కనిపించిన నొప్పులు మళ్లీ ఎక్కువైనట్టనిపించింది. దాంతో పాటు తలనొప్పి. ఒక్క క్షణం భయమేసింది సుబ్బారావుకు. కొంపతీసి తనకు 'కరోనా' సోకలేదు కదా! అలా అనుకునేంతలో దగ్గు తెరలు తెరలుగా వచ్చి ఆగిపోయింది. అప్పుడు మొదలైంది... చిన్నగా బతుకు భయం. లాభం లేదు. తనకు కరోనా సోకినట్టుంది. అవే లక్షణాలు కనిపిస్తున్నాయి. ఇప్పుడేమిటి దారి? గుండెలు వేగంగా కొట్టుకున్నాయి సుబ్బారావుకు.

కొడుకు ఫోన్ చేస్తే బాగుండును. వాడే చెయ్యాలి. తనకు చెయ్యడం అవదు. మంచం మీంచి లేద్దామని అనుకున్నా ఏదో మగతగా కమ్మినట్టయి లేవలేకపోయాడు. మళ్లీ ఆలోచనలు మొదలయ్యాయి. తనకు ఒక కల. అది తీరుతుందనుకున్నాడు ఇంత కాలం. తను పూర్తి సర్వీసు చేసి రిటైర్ అయి ఇంటికొచ్చేయాలి ప్రశాంతంగా. పెన్షన్ తీసుకొంటూ ప్రశాంతంగా గడపాలి.

కొడుకు రెండు నెలల క్రితం ''మీకు పాస్‌పోర్ట్, వీసా వచ్చే ఏర్పాటు చేస్తాను. రెండు నెలలు సెలవు పెట్టి ఇక్కడికి వచ్చేయండి. నాతో సరదాగా గడుపుదురుగాని!'' అన్నాడు.

''అమ్మో... రెండు నెలలు సెలవా? నేను ఉద్యోగం సెలవు పెడితే ఉత్తరాలు ఎవరు బట్వాడా చేస్తారు? అలా ఆ ఉత్తరాలు పేరుకుపోతాయి. పైగా మా బ్రాంచి ఆఫీసులో పోస్ట్‌మేన్‌ల కొరత ఉంది'' అనేసాడు.

అందుకు కొడుకు, ''మీది మరీ చాదస్తం నాన్నా. మీరు సెలవు పెడితే మొత్తం తపాలా శాఖ స్తంభించిపోతుందన్నంతగా ఫీల్ అవుతున్నావ్'' అన్నాడు.

''లేదు. నేను రిటైర్ అయిన తర్వాత వస్తాను'' అనేసాడు.

ఇప్పుడదంతా గుర్తుకొచ్చింది. ఒక్కసారి మనసు బాధతో మెలికలు తిరిగినట్టయ్యింది సుబ్బారావుకు. పదవీ విరమణ చేసినవారికి తమ తపాలా శాఖలో చేసే సన్మానాలు గుర్తుకొచ్చాయి. హోదా కలిగిన తమ పై అధికారులు

వస్తారు. తమ సేవల గురించి మాట్లాడతారు. శాలువా కప్పుతారు. సన్మానపత్రం చదువుతారు. ఆ తర్వాత గౌరవంగా కారులో ఇంటికి పంపుతారు. అలా తనకు జరగబోయే సన్మానం గురించి ఇంత కాలం కలలు కంటూ వచ్చాడు. తన రిటైర్మెంట్ ఫంక్షన్‌లో తనకు సన్మానం చేసిన తర్వాత తనకిష్టమైన తిలక్ గారి ఆ కవిత తను అందరికీ చదివి వినిపిస్తాడు. అదే తనకు ఇప్పుడు మిగిలిన ఏకైక కోరిక. ఆ కోరిక తీరకుండానే తను చనిపోతాడా? సుబ్బారావులో భయం నీడలు.

అలాంటి పిచ్చి పిచ్చి ఆలోచనలతోనే రెండు మూడు గంటలు గడిచాయి. మెల్లగా లేచాడు. ఉదయం కొరియర్ బాయ్ తీసుకొచ్చిన మిగిలిన కాఫీ తాగాడు. ఓపికి వచ్చినట్టయ్యింది. ఇంతలో ఫోన్ మోగింది. 'హమ్మయ్య' అనుకొని ఫోన్ ఎత్తాడు. ఫోన్ ఎత్తి మాట్లాడుతుంటే మళ్లీ దగ్గు తెరలు తెరలుగా...

''ఏమయ్యింది?'' కంగారుగా అడిగాడు కొడుకు.

''ఏమోరా... మధ్యాహ్నం నుంచి వళ్లు నొప్పులు, తలపోటు, కాస్త జ్వరంగా కూడా ఉంది.''

''అయ్యో...'' అంటూ కొడుకు చిన్నగా నిట్టూర్చిన శబ్దం.

''కంగారుపడక నాన్నా. తగ్గిపోతుందిలే!'' అన్నాడు సుబ్బారావు.

''భయంగా ఉంది నాన్నా. ఒక్కడివే అయిపోయావు పాపం! నేను చూస్తే రాలేని పరిస్థితి...''

కొడుకు మాటల్లో ఆవేదన గమనించి, ''కంగారుపడకు. మందులు వేసుకుంటాను. రేపటికి అదే తగ్గిపోతుందిలే!'' అన్నాడు.

''ఏమో... కరోనా ఏమో... వెంటనే ఆస్పత్రిలో చేరితే మంచిది. నేను ఆ ఏర్పాట్లు చేస్తాను.''

ఆ మాటలకు చిన్నగా నవ్వి, ''ఈమాత్రం దానికే ఆస్పత్రి ఎందుకురా? ఆ కుర్రవాడితో మందులు తెప్పించు'' అన్నాడు సుబ్బారావు.

''అబ్బే... ఇప్పుడు ఏ విషయము తేలిగ్గా తీసుకోకూడదు. నీకు షుగరు, ఆస్తమా ఉన్నాయి కదా! ఆస్పత్రిలో అయితే ఆక్సిజన్ లెవెల్స్ చెక్ చేస్తారు. నాకు ధైర్యంగా ఉంటుంది ఇక్కడ'' చెప్పాడు కొడుకు.

''ఏమోరా... అనవసరంగా భయపడుతున్నావ్. ఇప్పుడు ఆస్పత్రి అంటే బోలెడు డబ్బు ఖర్చు కదా! పైగా బెడ్‌లు ఉంటాయో లేదో...'' అన్నాడు సుబ్బారావు సందేహంగా.

''అవన్నీ నేను చూస్తాను. ఈలోగా బ్యాగ్‌లో మీ మందులు, బట్టలు, ఒక దుప్పటి సర్దుకోండి!'' అంటూ కొడుకు ఫోన్ పెట్టేసాడు.

అంతవరకు ధైర్యంగా ఉండడానికి ప్రయత్నిస్తోన్న సుబ్బారావు డీలా పడిపోయాడు. ఆస్పత్రి అంటే అతనికి భయం. అప్పుడప్పుడు డాక్టర్ల దగ్గరికి సలహా కోసం వెళ్తాడు కానీ తన ఈ యాభై తొమ్మిదేళ్ల జీవితంలో ఆస్పత్రి గదిలో గడిపిన రోజు లేదు. గత సంవత్సరం భార్యకు గుండెనొప్పి రావడంతో ఆ అర్ధరాత్రి పూట ఆస్పత్రికి బయలుదేరాడు.

అంబులెన్స్‌లో తీసుకువెళ్లిన భార్య తనతో మాట్లాడుతూ మాట్లాడుతూ తన వళ్లో పడుకొని 'ఏదో మత్తుగా ఉందండి' అంటూ గాఢనిద్రలోనికి జారిపోయింది.

''సరే... పడుకో!'' అన్నాడు.

అంబులెన్స్ ఆస్పత్రికి చేరి ఆమెను ఆస్పత్రివారు ఉన్న పళంగా ఐ.సి.యు. లోకి తీసుకెళ్లి ఐదు నిమిషాల్లో చెప్పేసారు. అప్పుడు తనకు అర్థమైంది. తన వళ్లో నిద్రలోంచి ఆమె శాశ్వత నిద్రలోకి జారుకుందని. ఆ రాత్రంతా ఆమె పార్థివశరీరంతో గడిపాడు. తర్వాతి రోజు ఉదయం జీవంతో తీసుకెళ్లిన భార్యను నిర్జీవంగా తీసుకొచ్చాడు. అందుకే ఆస్పత్రి అంటే భయం సుబ్బారావుకు.

మళ్లీ ఆలోచనా సముద్రంలో కొట్టుకుపోయాడు. అలా ఎంతసేపు అస్థిమితంగా గడిపాడో తెలియదు. ఇంతలో ఇంటర్ కమ్ మోగింది.

''సార్... అంబులెన్స్ వచ్చింది'' అన్నాడు అవతలి సెక్యూరిటీ.

గబగబా తన సామాను, బట్టలు సర్దుకొని, బ్యాగు తీసుకొని, లిఫ్ట్ ఎక్కి సెక్యూరిటీ దగ్గరికి వచ్చాడు. అక్కడ ఆగిన అంబులెన్స్ పక్కనే కొరియర్ బాయ్ నవ్వుతూ నిలబడ్డాడు.

''బాబూ, నీకు చాలా శ్రమ ఇస్తున్నాను. ఆపద్బాంధవుడిలాగా నాకు దొరికావు'' అంటూ అంబులెన్స్ ఎక్కుతూంటే ` ''నేను చేస్తున్నదేమిటి సార్ మీరు చేసిన దాని మీద'' అన్నాడు కార్తిక్, రెండు చేతులు జోడిస్తూ.

'నేను చేసిందేమిటో?' ఆలోచిస్తూనే అంబులెన్స్‌లోని ఆ బెడ్ మీద పడుకున్నాడు. లోపల కూర్చున్న కాంపౌండర్ మొహానికి మాస్క్‌తో, వంటిని కప్పిన ప్రొటెక్టివ్ సూట్‌లో కనిపించాడు.

'అవును. కరోనా రోగుల దగ్గర ఇలాంటి జాగ్రత్తలు పాటించాలి' అనుకుంటూ ఆ వాహనంలోని కాట్ మీద పడుకున్నాడు.

అతను సుబ్బారావు ఛాతి పరీక్షించి ''ఎలా ఉంది సార్.. ఆయాసంగా ఉందా? ఆక్సిజన్ పెట్టాలా?'' అన్నాడు.

''బాగానే ఉంది. ఇబ్బంది లేదు'' అన్నాడు సుబ్బారావు. వాహనం ముందుకు కదిలింది.

★ ★ ★

సుబ్బారావు కళ్లు తెరవలేకపోతున్నాడు. కళ్లు మసకబారినట్టనిపించాయి. కళ్లకు అందరూ నీడలా కనిపిస్తున్నారు. ఏదో గొట్టం నోట్లో ఉంది. ముక్కు నుంచి ఒక ట్యూబ్ బైటికి వ్రేలాడుతోంది. పక్కనే ఇ.సి.జి. మిషను కాబోలు! దాని మీద ఏవో గీతలు మెరుస్తూ కనిపించాయి. ఎవరో గుసగుసగా అనుకున్న మాటలు వినిపించాయి.

''పాపం. పెద్దాయన ఆక్సిజన్ లెవెల్స్ పడిపోయాయి. మరి బతకడం కష్టమే! కొడుకు అమెరికాలో ఉన్నాడు. ఎవరో కొరియర్ బాయ్ టిఫిన్, భోజనం అందిస్తున్నాడట. అవును. అదంతా కొడుకే ఏర్పాటు చేసాడు. మరైతే

ఇప్పుడు చనిపోతే ఇతని పరిస్థితి ఏమిటి? కొడుకు అమెరికా నుంచి రాలేదు కదా? ఈ పరిస్థితిలో కనీసం సొంత రక్త సంబంధీకులే అంతిమసంస్కారాలు జరపలేని ఈ కల్లోల కాలంలో ఇతని గతేమిటి?'' అన్నారెవరో.

''ఏముంది... కొరియర్ సర్వీస్... ఇన్ని చేసిన అతను అది కూడా చేయడానికి సిద్ధంగా ఉన్నాడు. కొడుక్కి ఫోన్ చేసాం. పరిస్థితి బాగాలేదని. ఆ ఏర్పాట్లు కూడా జరిగిపోతున్నాయి'' ఆ మాటలు వాళ్లు ఎంత గుసగుసగా మాట్లాడుకుంటున్నా సుబ్బారావుకు లీలగా వినిపించాయి.

తనతో ఏ రక్త సంబంధం లేని ఆ కొరియర్ కుర్రవాడు తనకెంత సాయం చేస్తున్నాడు? ఏమైనా అంటే మీరు చేసిన దానితో పోలిస్తే ఇదెంత? అంటాడు. అసలు తను చేసిందేమిటో? ఆలోచిస్తోన్న సుబ్బారావులో ఆయాసం ఎక్కువైంది. తను రోజూ ఇష్టంగా చదువుకొనే ఆ కవిత మళ్లీ గుర్తుకొచ్చింది. తను పదవీ విరమణ రోజున చదువుదామనుకున్న ఆ కవితా పంక్తులు మనసులో మెదిలాయి.

''ఇన్ని ఇళ్లు తిరిగినా నీ గుండె బరువు దింపుకోడానికి ఒక్క గడప లేదు.

ఎన్ని కళ్లు పిలిచినా ఒక్క నయనం నీ కోటు దాటి లోపలికి చూడదు.

ఉత్తరం ఇచ్చి నిర్లిప్తుడిలా వెళ్లిపోయే నిన్ను చూసినపుడు తీరం వదిలి సముద్రంలోకి పోతోన్న ఏకాకి నౌక చప్పుడు.''

తన పదవి ముగిసే ముందు పలుకుదామనుకున్న ఆ కవితా వాక్యాలు జీవితం ముగిసే ముందు మననం చేసుకున్నాడు సుబ్బారావు. అతనెదురుగా ఉన్న ఇ.సి.జి. మెషిన్‌లో ఒక సరళరేఖ లాంటి గీత. ఆ గీతలాగే ఏ కదలికా లేకుండా ఐపోయాడు సుబ్బారావు.

★ ★ ★

ఎదురుగా దూరంలో శవం కాలుతోన్న దృశ్యం. కన్నీళ్లు తుడుచుకున్నాడు కొరియర్ బాయ్ కార్తిక్. తనింత వరకు కొరియర్ సర్వీస్ ద్వారా ఉత్తరాలు చేరవేసేవాడు. ఇప్పుడు ఒక పార్థివ శరీరాన్ని ఆస్పత్రి నుంచి స్మశానవాటికకు చేరవేసాడు.

''సుబ్బారావు గారూ... జోహార్...! మా ఆర్ఫన్ హాస్టల్లో పిల్లలకు ఉత్తరాలు వచ్చేవి కాదు. మీరే అప్పుడప్పుడు మాకు గ్రీటింగ్ కార్డ్స్ వచ్చినట్టుగా వాటిని కొని మాకు ఇచ్చేవారు. మా హృదయాలు ఎంతో సంతోషపడేవి. మీ ఋణం ఎలా తీర్చుకోవాలి? అనుకున్నాను. ఇలా తీరింది'' కళ్లు తుడుచుకుంటూ ఆఖరిసారి తన ఆత్మబంధువుకు ఒకసారి నమస్కరించి వెనుతిరిగాడు కొరియర్ బాయ్ కార్తిక్. తన గుండె చప్పుడు తనకే వినిపించినట్టయ్యింది. అది తీరం వదిలి సముద్రంలోకి పోతోన్న ఏకాకి నౌక చప్పుడు!

COMMENTS